ప్రజాశక్తి
శుక్రవారం 24 జనవరి 2025

ప్రభుత్వ పాఠశాలలో సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - సాలూరు:
స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా సామాజిక తనిఖీ బృందం ప్రతినిధులు గురువారం తనిఖీలు చేశారు. పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల తీరును పరిశీలించారు. సామాజిక తనిఖీ బృందం ప్రతినిధులు బి.దాసు, బి.శ్రీను, బి.వరాహమూర్తిలు పాఠశాల హెచ్ఎం ఎన్.జ్యోతి సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. పథకాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.గ్రామసభలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగట్లో రేషన్ డీలర్ పోస్టులు

- రూ.3 లక్షలు నుంచి రూ.7 లక్షలపైనే పలుకుతున్న రేటు
- వైసిపి వ్యక్తులకు అమ్మేశారనే ఆరోపణలు
- ఎమ్మెల్యేల కనుసన్నల్లో బేరసారాలు

ప్రజాశక్తి - పార్వతీపురం
జిల్లాలో రేషన్ డీలర్ పోస్టులు అంగట్లో సరుకుల్లా అమ్మకమయ్యాయన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఎవరు ఎక్కువ రేటుకు కొనుక్కుంటే వారికే డీలర్ పోస్టులకు సిఫార్సు చేయడానికి ఎమ్మెల్యేలు ఆశక్తి చూపించారన్న ప్రచారం జరుగుతోంది. రూ.3లక్షల నుంచి రూ.7లక్షల వరకు ఒక్కో డీలర్ పోస్టుకు ధర పలికినట్లు టిడిపి నాయకులు, కార్యకర్తలే గుసగుసలాడుకుంటున్నారు. డీలర్ పోస్టు రేటు పెంచుకోడానికే ఫలితాల విడుదలలో జాప్యం చేసినట్టు తెలుస్తోంది. పార్వతీపురం డివిజన్‌లో 36 రేషన్ డీలర్ పోస్టులకు గత ఏడాది డిసెంబర్‌లో దరఖాస్తులను ఆహ్వానించారు. 285 మంది దరఖాస్తు చేసుకోగా, 63 దరఖాస్తులను తిరస్కరించారు. 202 మంది డిసెంబర్ 23న డీలర్ పోస్టులకు రాత పరీక్ష రాశారు. కొద్ది రోజుల క్రితం ఇంటర్వ్యూలు ముగిశాయి. సర్దుబాట్లు ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎంపికైన అభ్యర్థుల జాబితాను గోప్యంగా అధికారులు ఈ జాబితాను విడుదల చేశారు. ఈ జాప్యం వెనుక అధికారపార్టీ ఎమ్మెల్యేల ఒత్తిళ్లే కారణమని స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్యేల కనుసన్నల్లో డీలర్ పోస్టులకు భారీగా బేరసారాలు జరిగాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఒక యువ ఎమ్మెల్యే డీలర్ పోస్టులను ప్రతిపక్ష పార్టీకి చెందిన వ్యక్తులకు ఎక్కువ రేటుకు అమ్ముకున్నారని టిడిపి నాయకులు, కార్యకర్తలే ఆరోపిస్తున్నారు. పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడిలో రెండు డీలర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరారు. ఒక డీలర్ పోస్టును స్థానిక టిడిపి నాయకుడికి కేటాయించగా మరో పోస్టును వైసిపి నాయకుడి బంధువుకు ఎక్కువ రేటుకు అమ్ముకున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వైసిపి నాయకుడికి డీలర్ పోస్టు కేటాయింపుపై ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు భగ్గుమంటున్నారు. ఈ మేరకు వారు కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే నివాసం వద్ద రభస సృష్టించినట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు డీలర్ పోస్టుల భర్తీలో అన్యాయం చేయడంపై తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. అదే విధంగా బందలుప్పి గ్రామానికి చెందిన డీలర్ పోస్టును కూడా స్థానిక టిడిపి నాయకత్వం సిఫార్సులకు వ్యతిరేకంగా కేటాయించడం పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది. బలిజిపేట మండలంలో కూడా ఐదు డీలర్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఇక్కడ కూడా స్థానిక టిడిపి నాయకులు సూచించిన వారినే డీలర్ పోస్టులకు ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. నారాయణపురంలో ఒక డీలర్ పోస్టును నిబంధనలకు విరుద్ధంగా అవివాహిత మహిళ ఎంపికకు సిఫార్సు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం గ్రామానికి చెందిన కోడలిని మాత్రమే ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే ఈ గ్రామానికి చెందిన డిగ్రీ చదువుతున్న అమ్మాయికి డీలర్ పోస్టుని కేటాయించడానికి దండిగా బేరసారాలు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పోస్టును రూ.3లక్షలకు అమ్మేశారనే గుసగుసలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో గల రెండు డీలర్ పోస్టులను కూడా వైసిపి సానుభూతి పరులకే అమ్ముకున్నారనే చర్చ నడుస్తోంది. 29వ వార్డు జగన్నాధపురం, నిర్వాసితుల కాలనీ డీలర్ పోస్టును రూ.5లక్షలకు అమ్మేసినట్లు తెలిసింది. తొలిసారి అనూహ్య రీతిలో విజయం సాధించిన ఈ యువ ఎమ్మెల్యే నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. ఎన్నికైన ఏడు నెలల్లోనే ఆయన ఎక్కువగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పరిస్థితి కనిపిస్తోంది. పార్టీ ప్రయోజనాల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలే పరమావధిగా ఆయన పని చేస్తున్న తీరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలను విస్మయానికి గురి చేస్తోంది. రానున్న ఎన్నికల నాటికి నియోజకవర్గ డీలిమిటేషన్‌లో బాగంగా సామాజిక సమీకరణలు మారిపోనున్న నేపథ్యంలో ఆయన అనతికాలంలోనే బరితెగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

శంబర జాతరకు ఏర్పాట్లు వేగవంతం చేయాలి

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి - పార్వతీపురం
శంబర పోలమాంబ జాతరకు ఏర్పాట్లు పక్కాగా, వేగంగా చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే శంబర పోలమాంబ జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఆయన సమీక్షించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతరను విజయవంతం చేసేందుకు ప్రతి అడుగు పకడ్బందీగా వేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అత్యంత జాగరూకతతో వ్యవహరించాలన్నారు. తాగునీటి సరఫరా కొరత లేకుండా చూడాలని, అవసరమైన పైప్ లైన్లు ముందుగా వేసి నిరంతరం నీటి సరఫరా ఉండాలని ఆదేశించారు. మరుగుదొడ్లకు కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. తాత్కాలిక, శాశ్వత ప్రాతిపదికన మరుగుదొడ్లు నిర్మించాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో సరైన పర్యవేక్షణ ఉండాలన్నారు. యాత్రికుల నడక మార్గంలోను, క్యూలైన్లకు వెళ్లే దారిలో ఎటువంటి ఆటంకం ఉండరాదన్నారు. చిల్లర దుకాణాల ఏర్పాటుకు కొన్ని స్థలాలు గుర్తించి అక్కడ ఏర్పాటు చేయాలని, నడకదారిలో ఎక్కడా అడ్డంగా దుకాణాలు ఉండరాదని ఆదేశించారు. పారిశుధ్యం అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. ప్రజలు పోలమాంబను దర్శించుకొనేందుకు ప్రజా రవాణా శాఖ తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్యూలైన్లు, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు సక్రమంగా ఏర్పాటు చేయాలని, ఆలయానికి ఆనుకుని ఉన్న గోముఖి నది వద్ద స్నానాలు, వంటలు చేపట్టడంపై దృష్టి సారించాలని ఆయన తెలిపారు. పోలీసులు బందోబస్తు, కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని అన్నారు. రోడ్డు నిర్వహణ పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్లాస్టిక్ వాడకుండా చూడాలన్నారు. ప్రతి పాయింట్ వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అభివద్ధి కార్యక్రమాలు ప్రదర్శన శాలలు ఏర్పాటు చేయాలన్నారు.

సిఎస్ఆర్ నిధులకు ప్రతిపాదనలు తయారు చేయాలి

సామాజిక బాధ్యత నిధుల (సిఎస్ఆర్)కు ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సిఎస్ఆర్ నిధులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసేందుకు వివిధ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య, విద్యా శాఖ, అంగన్వాడీ, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసాయం, ఉద్యానవన, జలవనరులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పశు సంవర్థక శాఖ, మత్స్య శాఖ, నైపుణ్య అభివద్ధి సంస్థ లు పరిధిలో పనులు చేపట్టుటకు, కొత్త ప్రాజెక్టులను చేపట్టేందుకు అవకాశం ఉందని వాటిపై సవివరమైన నివేదికలు తయారు చేయాలని ఆయన అన్నారు. సౌర విద్యుత్, కిచెన్ షెడ్స్, పాఠశాలలు, అంగన్వాడీల్లో మరుగు దొడ్ల నిర్మాణం, వ్యవసాయ రంగంలో సోలార్ పంప్ సెట్స్, పవర్ వీడర్లు, ఆయిల్ ఇంజిన్లు తదితర పరికరాలు అందించేందుకు, వన్ దన్ వికాస్ కేంద్రాలు (విడివికె) క్లస్టర్లుగా బలోపేతం చేసి మహిళలకు ఉపాధి అవకాశాలతో సహా వివిధ ప్రాజెక్టుల వల్ల ఉత్పన్నమయ్యే ఉపాధి అవకాశాలు వివరిస్తూ ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర సంస్థలకు సిఎస్ఆర్ నిధులకు ప్రతిపాదనలు పంపిస్తామని, వారు విడుదల చేసే నిధులకు అనుగుణంగా పనులు, ప్రాజెక్టులు చేపట్టడం జరుగుతుందని ఆయన చెప్పారు.

సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డ్వామా, డిఆర్‌డిఎ పీడీలు కె.రామచంద్రరావు, వై.సత్యంనాయుడు, డిఎంహెచ్ఒ ఎస్.భాస్కర రావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

ఏనుగుల సమస్యపై అటవీ అధికారులు దృష్టి సారించాలి

ప్రజాశక్తి -భామిని
గత ప్రభుత్వం ఐదేళ్ళ నిర్లక్ష్యంతో రైతులు ఏనుగులతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం అటవీ అధికారులు ఏనుగులు సమస్య శాశ్వత పరిష్కారానికి దృష్టి సారించాలని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. మండలంలోని పాతఘనసరలో ఏనుగుల గుంపు నష్టపర్చిన మొక్కజొన్న పొలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ప్రతి ఏటా ఏనుగులతో తమకు పంట నష్టం వాటిల్లుతుందని, ఏనుగుల సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను కోరారు. పాతఘనసరలో మొక్కజొన్న రైతులు ఏనుగుల సమస్యతో పంట నష్టపోతున్నారని, గురువారం పంటల పరిశీలనకు జిల్లా అటవీ అధికారి రావాలని కోరామని, అయినా ఆమె ఎందుకు రాలేదని, రైతుల పంట నష్టపోతుంటే అటవీ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని అటవీ శాఖ అధికారులను అడిగారు. అనంతరం మొక్కజొన్న రైతుల సమక్షంలో జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూనా, ప్రిన్సిపల్ సెక్రటరీ ఆఫ్ కన్జర్వేటివ్ ఫారెస్ట్ అధికారి చిరంజీవి చౌదరిని ఫోన్లో సంప్రదించి ఏనుగుల సమస్యను వివరించారు. అటవీ అధికారులు చొరవ చూపి త్వరితగతిగా సమస్య పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని ఫోన్లో తెలిపారు. అటవీశాఖాధికారుల వల్ల ఈ సమస్య పరిష్కారం కాకుంటే, రైతులకు వాటిని ఎలా తరలించాలో అంశం తెలుసునని, తర్వాత ఈ అంశంలో రైతులపై అటవీ శాఖ అధికారులు కేసుల నమోదు చేస్తే సహించేది లేదని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఎమ్మెల్యే జయకష్ణ రైతులతో మాట్లాడుతూ, అటవీ శాఖ అధికారులు స్పందిస్తారని, మీతో పాటు తాను కూడా ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాడుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు రవినాయుడు, ఎం.జగదీశ్వరరావు, మాజీ ఎంపిపి భూపతి ఆనందరావు, తూర్పు కార్పొరేషన్ డైరెక్టర్ గర్భాన సత్తిబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎం. తేజోవతి, మండల జనసేన అధ్యక్షులు రుంకు కిరణ్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు కె.రామారావు, డి.గంగరాజు, టిడిపి నాయకులు కె. రాజేష్, పొన్నాడ నాగేశ్వరరావు, టిడిపి నాయకులు, జనసేన నాయకులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

20లోగా పల్లె పండగ పనులు పూర్తి కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం
జిల్లాలో పల్లె పండగ కింద చేపట్టిన రహదారి పనులన్నీ ఫిబ్రవరి 20లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైతే అదనపు పనివారిని ఏర్పాటు చేసుకొని, త్వరితగతిన పనులు పూర్తిచేయాలన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధిహామీ కింద చేపడుతున్న పల్లెపండగ పనులపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగలో మంజూరు చేసిన పనులన్నీ వచ్చే నెల 20లోగా పూర్తిచేయాల్సి ఉన్నప్పటికీ, ఇంతవరకు ప్రగతి కనిపించక పోవడం పట్ల కలెక్టర్ ఆరా తీశారు. ఇప్పటివరకు 32 శాతం పనులకు మాత్రమే ప్రారంభించారని, మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అన్నారు. పల్లె పండగ పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, దీనిపై జిల్లాల వారీగా ర్యాంకులు ఉంటాయని అన్నారు. కావున ఇంజినీర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి అప్పగించిన లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. ప్రతి రోజూ ప్రగతి ఉండాలని, రోజు వారీ ప్రగతి వివరాలను తమకు సమర్పించాలని అన్నారు. అదేవిధంగా పల్లె పండగ కింద చేపట్టిన బీటీ, సీసీ రోడ్లలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, నాణ్యత లోపం ఉంటే చెల్లింపులు జరగబోవని కలెక్టర్ వివరించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి బి.చంద్రశేఖర్, నగేష్‌బాబు, పిఆర్, ఐటిడిఎ, పిఐయు ఇఇలు, ఎఇఇలు తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్
స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిత గురువారం పరిశీలించారు. వివిఐపిలకు, కళాకారులకు, ప్రేక్షకులు వీక్షించేందుకు ఏర్పాటు చేయనున్న గ్యాలరీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ పతాకం ఆవిష్కరణ స్థూపం, సభా వేదిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శన వేదిక, తదితర పనులు ప్రత్యేక శ్రద్ధవహించాలన్నారు. వివిధ శాఖలు నిర్వహించనున్న స్టాల్స్‌కు కేటాయించిన స్థలాలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను పక్కాగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ కె.హేమలత, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ, డిఆర్‌డిఎ వై.సత్యంనాయుడు, డిపిఆర్ఒ ఎల్.రమేష్, డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రాజులు, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్‌డే వేడుకల ఏర్పాట్లును పరిశీలిస్తున్న జెసి శోభిత, సబ్‌కలెక్టర్

శివ్వాలవీధిలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టాలి

అతిసారను అదుపు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కురుపాం
పారిశుధ్య పనులను అధికారులు, ప్రజా పతినిధులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి అతిసారను అదుపు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. కురుపాంలో అతిసారం ప్రబలిన గాంధీనగర్, శివ్వాలవీధి, గౌడ్ వీధుల్లో గల డ్రైనేజీలను, వాటర్ ట్యాంకులను, పైపులైన్లను గురువారం పరిశీలించారు. గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి అతిసార బాధితుల వివరాలు, ఆరోగ్య పరిస్థితిని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అతిసారకు సంబంధించిన మందులన్నీ అందుబాటులో ఉన్నాయా అని వైద్య సిబ్బందిని అడగ్గా అన్నీ మందులు అందుబాటులో ఉన్నాయని, గ్రామంలో అన్ని వీధిల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. గురువారం ఒక్క కేసు మాత్రమే వచ్చిందని తెలిపారు. అనంతరం గంగునాయుడు మాట్లాడుతూ తక్షణమే ప్రజాప్రతినిధులు స్పందించి అతిసారం ప్రబలిన నేపథ్యంలో పంచాయతీకి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి అన్ని వీధుల్లో పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి అన్ని వాటర్ ట్యాంకులను పరిశుభ్రపర్చి క్లోరినేషన్ చేసి పైప్ లైన్లు లీకేజీ లేకుండా చూడాలని కోరారు. ప్రతి వీధిలోనూ వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో వైద్య సిబ్బంది ఉండేలా చూసి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇకపై అతిసార పెరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాంఘిక సంక్షేమ వసతిగృహ అధికారుల సమావేశంలో పాల్గొన్న డిడి గయాజుద్దీన్

పబ్లిక్ పరీక్షలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం
మరో రెండు నెలల్లో జరగనున్న పది, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై హాస్టల్ వార్డెన్లు దృష్టి సారించాలని సాంఘిక సంక్షేమ డిడి గయాజుద్దీన్ ఆదేశించారు. గురువారం ఆయన సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా వసతి గృహ సంరక్షకులతో డిడి ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. మార్చిలో జరగనున్న టెన్త్, ఇంటర్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అధిక శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహ భవనాలు 13 ఉండగా, అందులో 11 భవనాలకు మైనర్, మేజర్ రిపేర్లు చేయించడానికి రూ.189 లక్షలు మంజూరయ్యాయని, టెండర్ల ప్రక్రియ జరుగుతున్నదని చెప్పారు. ఈ పనులను వసతి సంరక్షకులు దగ్గరుండి ఫిబ్రవరి నెలాఖరులోగా పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ ఏడాది విద్యార్థులకు టవల్స్, స్పోర్ట్స్ మెటీరియల్, వంట పాత్రలు, స్టేషనరీ సౌకర్యాలకు సంబంధించిన సరుకులు ప్రభుత్వం ముందుగానే అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ వార్డులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగ అవకాశాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పార్వతీపురం
జిల్లాలో పారిశ్రామికంగా అవకాశాలు ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పర్యాటక, ఆతిథ్య రంగాన్ని పారిశ్రామిక రంగంగా గుర్తించాలని పారిశ్రామిక రంగ ప్రతినిధులకు తెలిపారు. పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక, ఆతిథ్య రంగాల్ని సేవా రంగాలుగా పరిగణిస్తున్న నేపథ్యంలో పర్యాటక రంగంతో పాటు ఆతిథ్య రంగాలైన హెూటళ్లు తదితర వాటిని ఏర్పాటు చేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేయడం, ఐటిని ప్రోత్సహించడం, ఆన్‌లైన్ పరీక్షల నిర్వహణ కేంద్రాలు ఏర్పాటుకు అవకాశాలు జిల్లాలో ఎక్కువగా ఉన్నట్లు కలెక్టర్ అభిప్రాయపడ్డారు. మినరల్స్‌కు కూడా జిల్లాలో ఎక్కువ అవకాశాలు ఉన్నందున, దాన్ని కూడా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. నిమ్మగడ్డితో వస్తువుల తయారీ కేంద్రాల స్థాపనకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నూతన పారిశ్రామిక విధానం కింద తయారీ, సేవా రంగాలకు పెట్టుబడి రాయితీ, స్టాంప్ డ్యూటీ, విద్యుత్ రాయితీ, భూమార్పిడి, జిఎస్టి, వడ్డీ రాయితీ తదితర అంశాల్లో ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్న సంగతిని కలెక్టర్ గుర్తు చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, సహాయ సంచాలకులు పి.సీతారాము, రామకష్ణ, ఐపిఒ కిరణ్, జిల్లా భూగర్భ జలాల అధికారి ఏ రాజశేఖర రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎన్.విజయ్ స్వరూప్, నాబార్డ్ ఏజీఎం దినేష్, జిల్లా రవాణా అధికారి ఎం.శశికుమార్, జిల్లా కార్మిక శాఖ అధికారి రామకష్ణ, పారిశ్రామిక ప్రతినిధులు ఉదయభాను, శ్రీదేవి, ఇతర అధికార ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గోముఖిపై తాత్కాలిక కాజ్‌వే నిర్మాణం

రూ9 లక్షలు నిధులతో పిఆర్ పనులు
'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - మక్కువ
మండలంలోని శంబర పోలమాంబ జాతర నేపథ్యంలో మండలంలోని చెముడు మీదుగా వెళ్లే యాత్రికులకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు శంబర గ్రామ సమీపంలో గోముఖి నదిపై పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో తాత్కాలిక వంతెన పనులు చేపడుతున్నారు. రూ.9 లక్షల నిధులతో ఈ పనులను చేపట్టారు. ఐదు మీటర్లు వెడల్పు ,13. 6 మీటర్ల పొడుగున ఈ కాజివే నిర్మాణం పూర్తి చేశారు. ఇటీవల ప్రజాశక్తిలో ఈనెల 3న గోముఖీ నదిపై కోతకు గురైె కాజ్‌వేపై ప్రచురితమైన పూడ్చితేనే... లేకుంటే ప్రమాదం' అన్న వార్త కు అధికారులు స్పందించారు. వాస్తవంగా చెముడు. శంబర గ్రామాల మధ్య రహదారి ఆర్ అండ్ బి శాఖ పరిధిలో ఉం. అయితే ఆ శాఖలో నిధులు లేనందున పంచాయతీరాజ్ శాఖకు దాన్ని బదలాయించినట్లు తెలిసింది. మరోవైపు 16 పైపులతో కాజ్వే నిర్మాణం చేపట్టినా, రక్షణ గోడ నిర్మించకపోవడంతో ఈ వంతెనకి ఇరువైపుల రహదారి నదీ ప్రవాహానికి కొట్టుకుపోయే పరిస్థితి ఉందని స్థానికులు అంటున్నారు. దీనిపై పిఆర్ మండల ఇంజనీరింగ్ అధికారి బి.రజిత్‌ను వివరణ కోరగా నిధులు ఆ మేరకే వచ్చాయని జాతర సమీపిస్తున్నందున త్వరితగతిని ఈ కాలేజ్‌వే పనులు పూర్తి చేశామని ఆయన తెలిపారు. మంజూరు కూడా తాత్కాలిక వంతెనగానే ఉందని ఆయన వివరించారు.

గోముఖీ నదిపై నిర్మిస్తున్న కాజ్‌వే

2న డెల్టా రాష్ట్ర స్థాయి పరీక్ష

బొబ్బిలి: పదో తరగతి పరీక్షలకు హాజర వుతున్న విద్యార్థులకు ఆంగ్ల భాష సామర్థ్య ప్రతిభ పాటవ పోటీపరీక్షల మాదిరి ప్రశ్నాపత్రాలను రాష్ట్ర ఆంగ్లభాషోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బొబ్బిలి డివిజన్ డిప్యూటీ డిఇఒ మోహన్‌రావు గురువారం విడుదల చేశారు. స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఎంఇఒలు చల్ల లక్ష్మణ రావు, గొట్టాపు వాసుతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెల్టా ఆధ్వర్యంలో గత 14 సంవత్సరాలుగా పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ పాఠ్యాంశాలపై పోటీ పరీక్షలు నిరంతరంగా నిర్వహించడం గొప్ప విషయన్నారు.

సీతంపేటలోని వసతిగృహ రికార్డులను పరిశీలిస్తున్న బాలల సంరక్షణ బృందం

బాలల వసతిగృహాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లా బాలల సంరక్షణ, తనిఖీల కమిటీ పార్వతీపురం మండలం డికె పట్నంలో గల లవ్స్ హెూమ్, సీతంపేట మండలం లచ్చయ్యపేటలో గల స్వామి దయానంద సరస్వతి సేవా ఆశ్రమాన్ని తనిఖీ చేసింది. ఈ చిల్డ్రన్ హెూమ్‌ల తనిఖీల్లో భాగంగా పిల్లలు సంరక్షణలో మౌలిక వసతులు పరిశీలించింది. జిల్లా ప్రొఫెషన్ ఆఫీసర్ బివి రవికుమార్ ఈ వసతిగృహాలను పరిశీలన తర్వాతే లైసెన్సులు ఇస్తామన్నారు. అలాగే జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లలకు తప్పనిసరిగా మౌలిక వసతులు ఉండాలని మినిమం అవసరాలు ఉండాలని పిల్లల వసతుల మేనేజ్మెంట్‌కు తెలిపారు. జిల్లా బాలబాలికల వసతుల తనిఖీ కమిటీ అధికారులు జిల్లా లీగల్ కం ప్రొబిషన్ ఆఫీసర్ పి.శ్రీధర్ మాట్లాడుతూ చిల్డ్రన్ హెూమ్స్ వసతులు తగ్గే పిల్లలు మేనేజ్మెంట్‌కు సూచించారు. ఈ కమిటీ సభ్యులు జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ ఐసి -ఎన్ ప్రసాదురావు, జిల్లా ప్రొటెక్షన్ ఆఫీసర్ - నాన్ ఇనిస్టిట్యూషనల్ కేర్ ఎం.అరసవిల్లి నాయుడు చిల్డ్రన్ హెూమ్స్ మేనేజ్మెంట్ సురేష్ నల్ల, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉల్లాష్‌పై శిక్షణ

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 24న (శుక్రవారం) ఉల్లాస్‌పై శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభించన్నామని తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

రబీ పంటల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని గుచ్చిమిలో మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్ ఇ- పంట రబీ 2024-25కి సంబంధించి సూపర్ చెక్ చేసేందుకు క్షేత్ర స్థాయిలో గురువారం పర్యవేక్షించారు. ఇందులో భాగంగా రబీలో ఇ-పంట నమోదు చేసిన సర్వే నెంబర్లలో కొన్ని ర్యాండమ్‌గా వస్తుంది. ఇలా వచ్చిన సర్వే నెంబర్లో రైతు పేరు, తండ్రి పేరు, విస్తీర్ణం, పంట, పంట రకం, సాగు పద్ధతి, సాగు సరళి, నీటి ఆధారం, విత్తిన తేదీ ఎలా ప్రతి అంశం తనిఖీ చేస్తామని జరుగుతుంది. ఇలా మండలం మొత్తం గ్రామాల్లో సూపర్ చెక్ చేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే క్రాప్ లైఫ్ సైన్సెస్ యాప్ పంట దశ, తెగులు, పురుగులు, పోషక లోపాలను అప్లోడ్ చేసేందుకు ఉపయోగపడుతుందని, దీని ద్వారా భవిష్యత్తులో రైతులకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ యాప్‌లో వివిఎ తమ పరిధిలో గల పంటలను అప్లోడ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

రవీంద్రకు జాతీయ అవార్డు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దుగ్గికి చెందిన ఆరిక రవీంద్ర నేషనల్ అవార్డు అందుకున్నాడు. డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగం లేక, తన స్వయం కృషితో, కుటుంబ సహకారంతో వ్యవసాయం చేశారు. ఈ సమయంలో లయ సంస్థ ద్వారా శిక్షణ పొందారు. ఈ శిక్షణలో ఆయన ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు ఆయన్ను గ్రామస్తులు, స్నేహితులు అభినందించారు.

అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంవిఐ వేణుగోపాల్

వాహనాలు అతివేగంగా నడపొద్దు

ప్రజాశక్తి -పాలకొండ

వాహనాలను అతివేగంగా నడపొద్దని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టివి వేణుగోపాల్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలు భాగంగా గురువారం పట్టణంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా జాగ్రత్తలు పాటించి అన్నారు అతివేగం ప్రమాదాలకు దారితీస్తాయి అన్నారు అనంతరం విద్యార్థులతో భారీ ర్యాలీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ నవీన్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఇఇ టిజికె మూర్తి తెలిపారు. మండలంలోని ఆర్తలి, విపి రాజుపేట, బాసూరు, ఎల్ఎల్ పురం, కోటిపల్లి, చిన్నకోటిపల్లి, చంద్రయనవలస గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయందని తెలిపారు. ప్రజలంతా ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

ముమ్మరంగా వాహనాలు తనిఖీలు

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలో గురువారం స్థానిక ఎస్సై పి.నారాయణరావు ముమ్మరంగా వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేనిటువంటి వాహనదారులకు అపరాధరుసుం వేసి ఇంతవరకు పెనాల్టీ కట్టినటు వంటి వాహనాదారులకు వెంటనే జరిమానా కట్టించారు. అనంతరం స్థానిక వారపు సంతను సందర్శించి వ్యాపారులు అమ్ముతున్న సామాగ్రిని పరిశీలించి సంతకు వచ్చిన గిరిజనులకు సైబర్ క్రైమ్, రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వాడుతున్న ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల బారినపడకుండా జాగ్రత్తగా ఉండాలని, అలాగే వాహనం నడుపుతున్న ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించి, మద్యం సేవించకుండా వాహనాలు నడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద ఎస్ఐ ఎం.రాజేష్ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనదారులకు, ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై ఎఎస్ఐ ఎల్.శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. ఆటోలో మితిమీరిన ప్రయాణికులను ఎక్కించుకోరాదని, డ్రైవరుకు ఇరువైపులా ప్రయాణికులు కూర్చోవడానికి అనుమతించొద్దని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు, లైసెన్స్ లేని వ్యక్తులు వాహనాలు నడపడానికి అనుమతించరాదని, రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలు గమనించి జాగ్రత్తగా రోడ్డును దాటాలని అన్నారు. అలాగే సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలని చేపట్టిన ర్యాలీలో ఫ్ల కార్డులు, బ్యానర్ల ద్వారా చూపిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం సంతలో రోడ్డు భద్రతపై గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ఘనంగా లోకేష్ పుట్టిరోజు వేడుకలు

రాష్ట్ర ఐటి, మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు పార్వతీపురం మన్యం జిల్లాలో పలుచోట్ల ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పలువురు ప్రజాప్రతినిధుల ఆధ్వర్యాన కేక్ కట్ చేస్తూ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ వంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టారు.

సాలూరులో కేక్ కట్ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

గుమ్మలక్ష్మీపురంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

సీతంపేటలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీలో పాల్గొన్న టిడిపి నాయకులు భూదేవి

కురుపాంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న టిడిపి నాయకులు వీరేష్‌చంద్రదేవ్

పాలకొండలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

పార్వతీపురంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు

ఘనంగా నేతాజీ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో గల నేతాజీ గ్రంథాలయం వద్ద ఆ గ్రంథాలయం వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు నేతృత్వంలో నేతాజీ సుభాష్‌చంద్రబోష్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. తొలుత సంజీవనాయుడు సుభాష్‌చంద్రబోష్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన త్యాగంపై మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.


కొమరాడలో సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపల్

కొమరాడ : స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధనకు కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వై.నాగేశ్వరరావు అన్నారు. సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు స్థానిక జూనియర్ కాలేజ్ లో ఘనంగా జరిగాయి. తొలుత నేతాజీ చిత్రపటానికి కాలేజీ ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేతాజీ స్ఫూర్తితో దేశ లౌకిక, సౌభ్రాతృ, సార్వభౌమత్వాన్ని పరిరక్షించుకొనేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భామిని: స్థానిక గ్రంథాలయంలో లైబ్రయన్ గొటివాడ ఇందిరా ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ సొంతంగా ఒక ఆర్మీ ని స్థాపించి, భారతదేశ స్వాతంత్రం కోసం పోరాటం చేశారని, మీరు రక్తాన్ని త్యాగం చేస్తే మీకు స్వతంత్రం సిద్ధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పశు వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పశువైద్య వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ములగలో వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఎడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరిసర గ్రామాల నుంచి పాడి రైతులు తమ పశువులను, గొర్రెలు, మేకలను తీసుకొచ్చి నివారణ మందులు, అంటురోగాలకు టీకాలు వేయించారు. పాల ఉత్పత్తులు పెరుగుదలకు, మూగ జీవాల ఆరోగ్యానికి మేలైన పద్ధతులు పాటించాలని ఎడి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మడక కృష్ణవేణి, విశ్వనాథం, రెడ్డి చిన్నంనాయుడు, పశువైద్యుడు భోగి చక్రధరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని నిడగల్లు, ఆర్.వెంకంపేట, పాపయ్యవలసలో పశువైద్య శిబిరాలను వైద్యాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా పశు సంవరక శాఖ ఏడి సిహెచ్ దేవకుమార్ మాట్లాడుతూ ఈ శిబిరాల్లో పశువులకు టీకాలు వేయబడతాయని, గర్భధారణకు సంబంధించి వ్యాధులకు తనిఖీలు నిర్వహించి మందులు ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి ఎస్.రామారావు, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు బొత్తాడ గౌరీ శంకర్రావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి పాడి రైతు తమ పశువులను వైద్య శిబిరానికి తీసుకొచ్చి వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి పి. లక్ష్మణరావు, వైస్ ఎంపిపి శేఖర్, ఉప సర్పంచ్ కిషోర్ తదితరులు ఉన్నారు.

గరుగుబిల్లి: ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కొప్పల వెలమ వెల్ఫేర్ మరియు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అక్కేన మధుసూదనరావు అన్నారు. మండల పరిధిలోని నాగూరులో మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్న ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఆయనతో పాటు సర్పంచ్ ప్రతినిధి కేతిరెడ్డి అచ్యుతరావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది మంత్రబుడ్డి శ్రీరాములు నాయుడు, ఆలుగుల వెంకటి, బొత్స అప్పలనాయుడు, మిరియాల సింహాచలంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలో ధారపాడు పంచాయతీ కోసంగిలో పశుపు ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ జీలకర్ర సుందరమ్మ ప్రారంభించారు. దోనుబాయి పశువైద్యాధికారి రాజాం శంకరరావు పశువులకు టీకాలు వేశారు. పాడి రైతులకు పశు వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భామిని : పశు ఆరోగ్య శిబిరం ద్వారా పశువులకు అందిస్తున్న వైద్య సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ ఎడి శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ఘనసరలో పశు ఆరోగ్య శిబిరంలో 45 పశువులకి గర్భకోస వ్యాధి చికిత్సలు నిర్వహించారు. 35 దూడలకు నట్టల నివారణ మందులను అందించారు. 55 పశువులకు సాధారణ చికిత్సలు నిర్వహిం చారు. అనంతరం పాడి రైతులకు పశువుల పెంపకం, వ్యాధుల నుండి సంరక్షణ, పశువ్యాక్సిన్లపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో భామని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మడక సంతోష్ కుమార్, పశుగణాభివద్ధి సంస్థ డాక్టర్ రాధా రాణి, పశుసంవర్ధక శాఖ ఎడి, గోపాల మిత్రులు ఉన్నారు.

కొనసాగుతున్న కుష్టి వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని కుమ్మరిగుంట, తలవరం, నీలానగరం, పనస నందివాడ, బిటివాడ, దశమంతపురం, సంతనర్సిపురం, కిమ్మి, చిట్టిపూడివలస, కంబర తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే చేపడుతున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఏ రకమైన మచ్చలు, తిమ్మిర్లు, బొబ్బర్లు వంటి ఉన్నట్లయితే మొహమాటం లేకుండా చెప్పవచ్చునని సిబ్బంది గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, GUNURU ALIVELI PYDI PRASUNA, W/O SAMBANGI VENKATESH PREVIOUSLY CALLED SAMBANGI ALIVELI PYDI PRASUNA, RESIDENT OF PLOT N0-229, D NO-2-124/18/1, VUDA REVENUE LAYOUT, VISAKHAPATNAM (RURAL), P.O. MADHURWADA, VISAKHAPATNAM DISTRICT, NOW CHANGED MY NAME FROM SAMBANGI ALIVELI PYDI PRASUNA TO **GUNURU ALIVELI PYDI PRASUNA.** HENCE FORTH I WILL BE CALLED AS **GUNURU ALIVELI PYDI PRASUNA** FOR ALL PURPOSE

25న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈ నెల 25న స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ సాల్మన్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజున ఉదయం 10గంటలకు ఎంపిపి దీనమయ్య అధ్యక్షతన జరగున్న ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

పెదబుడ్డిడికి బస్సు నడపాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మ వలస మండలం పెదబుడ్డిడి గ్రామానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. తమ గ్రామానికి నడుస్తున్న బస్సును రెండేళ్ల క్రితం రద్దు చేయడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. ఒక్కొక్క సమయంలో రావివలస వరకు నడక ప్రయాణం తప్పడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నేటికీ బస్సు వేయకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలకు స్పందించి పెదబుడ్డిడి గ్రామానికి బస్సు నడపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వికలాంగ విద్యార్థులకు వితరణ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని వెంగాపురం ఎంపిటిసిసభ్యులు గులిపల్లి మురళి విజయనగరంలో గల చెవిటి, మూగ విద్యార్థులకు రూ.6వేలు వితరణగా గురువారం విజయనగరంలోని అశోక్‌బంగ్లాలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగవైకల్యం మనిషిలో లేదని, అటువంటి వ్యక్తులకు సహాయ సహకారాలు అందించకపోవడం అంగవైకల్యమని అన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ఎప్పుడైనా తన వంతు సహాయ సహకారాలు వారికి ఉంటాయని ఆయన అన్నారు.

విక్రంపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విక్రంపురంలో గురువారం స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, మధుమేహ, రక్తపోటు, తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

పలువురు ఉపాధిహామీ సిబ్బందికి జరిమానాలు

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానికమండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం జరిగిన ఉపాధిహామీ మండల స్థాయి ప్రజా వేదికలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన ఆ శాఖ సిబ్బందికి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు జరిమానాలు విధించారు. ఉపాధిహామీ చట్టం కింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన మండలంలో రూ.26.36 కోట్లు పనులు జరగ్గా, వీటిలో అనేక అక్రమాలు జరిగినట్టు తనిఖీ బృందం గుర్తించి నివేదికను అందించాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. అనేక గ్రామపంచాయతీల్లో మాస్టర్లు ఎటువంటి వేలు ముద్రలు గానీ, సంతకం కానీ లేకుండా ఎన్ఎంఎంఎస్ ద్వారా హాజరు పంపించి పేమెంట్ చేసిన క్షేత్ర సహాయకులకు, మేట్లకు రికవరీ విధించారు. అలాగే అజ్జాడ గ్రామపంచాయతీలో చనిపోయిన వారి పేర్లు మీదుగా హాజరు పంపించి పేమెంట్ చేసినట్లు గుర్తించి, అందుకు బాధ్యులపైన రూ.1158 రికవరీ విధించారు. పనుకువలస గ్రామపంచాయతీలో ఊర్లో లేని వారి పేర్లు మీద హాజరు పంపిస్తున్నారని ఫిర్యాదు రాగా, మండలం మొత్తంగా రూ.68,313 రికవరీ విధించారు. కార్యక్రమంలో ఎంపిపి జి.నాగమణి, ఎంపిడిఒ కె.విజయలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు ఎ.రవికుమార్, ఎపిడి జి.శ్రీహరిరావు, డివిఒ శ్రీనివాసరావు, ఉపాధిహామీ సిబ్బంది, వేతనదారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి - పాచిపెంట

నిరసనలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు ఈశ్వరరావు

మండలంలో ఉపాధి హామీ పనులు వెంటనే ప్రారంభించి ప్రజల వలసల నివారణ చర్యలు చేపటాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు సుర్రు రామారావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పాచిపెంటలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లేక ఏజెన్సీ, మైదాన ప్రాంతాలన్న తేడా లేకుండా పనులు కోసం పొట్టచేత పట్టుకుని అనేక వ్యవసాయ కార్మికులు వలసలుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేసి వలసల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన తప్పిదాలను సవరించి, కేరళ తరహాలో రోజు కూలి రూ.650 చెల్లించేలా చర్యలు చేపట్టి కూలీలను ఆదుకోవాలని కోరారు. పనులు చేసే చోట అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ చట్టాన్ని సక్రమంగా అమలు చేసి ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా ఉపాధి హామీ చట్టానికి కావాల్సిన బడ్జెట్ కేటాయింపులు తగ్గించేసి గిట్టుబాటు లేకుండా చేస్తుందని విమర్శించారు. ఎర్రజెండా నాయకత్వంలో పోరాడి సాధించుకునే ఉపాధి చట్టాన్ని సక్రమంగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కొర్ర కళ్యాణ్, గన్నెల భీమయ్య తదితరులు పాల్గొన్నారు

PARVATHIPURAM MUNICIPALITY

e.PROCUREMENT TENDER NOTICE

S.No.	NIT No.	No. of works	Total Estimate Amount
1.	Tender No.2/2024-25 15th Grant and General Fund)	16 Works	Rs.120.41 Lakhs
	Total	16 Works	Rs.120.41 Lakhs

For further details visit : For all details visit site
www.apeprocurement.gov.in

Sd/- G. Srinivasa Raju
Commissioner (FAC),
Parvathipuram Municipality